ఆంధ్రజ్యోతి
5
ANDHRAJYOTHY
అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 17 జూన్ 2024

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

నేడు ఈద్గాలు, మస్జిద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు



అనంతపురం కల్చరల్, జూన్ 16: ముస్లింలు జరుపుకునే ప్రధాన పండుగల్లో బక్రీద్ ఒకటి. దీనిని ఈద్ అల్-అజ్ హా లేదా బక్రీద్ అని కూడా అంటారు. త్యాగానికి నిదర్శనంగా వ్యవహరించబడే ఈ పండుగను మూడు రోజులు జరుపుకుంటారు. రంజాన్ పర్వదినం ముగిసిన 70 రోజుల తర్వాత బక్రీద్ పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. బక్రీద్ పండుగకు ముందురోజునే ముస్లింలు మరణించిన తమవారి సమాధుల వద్ద వారికి ఇష్టమైన దుస్తులు, ఆహార పదార్థాలను ఉంచడం ఆనవాయితీ. ఇలా ఉంచడం వల్ల వారు స్వర్గం నుంచే వాటిని స్వీకరిస్తారని విశ్వాసం. పండుగ నేపథ్యంలో ధనికులైన ముస్లింలు పొట్టేలు మాంసాన్ని పేదలకు 'కుర్బానీ' పేరుతో వితరణ చేయడం ఆనవాయితీ. రంజాన్‌లాగానే బక్రీద్ నాడూ ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. బక్రీద్ నేపథ్యంలో సోమవారం నిర్వహించే సామూహిక ప్రార్థనల కోసం జిల్లాలోని ఈద్గాలు, మసీదులు సిద్ధమయ్యాయి. కాగా ప్రాంతాల వారీగా మసీదుల్లో 6.30 గంటల నుంచి ప్రార్థనలు ప్రారంభమవుతాయని, ఎస్కేయూ సమీపంలోని ఈద్గాలో ఉదయం 8.30 గంటలకు, హెచ్చెల్సీ కాలనీ ఈద్గాలో 9 గంటలకు, డ్రైవర్స్ కాలనీలోని ఈద్గాలో ఉదయం 9.30 గంటలకు ప్రార్థనలు నిర్వహిస్తామని ముస్లిం మతపెద్దలు పేర్కొంటున్నారు. నిర్దేశిత సమయాల్లో ముస్లింలు మసీదులు, ఈద్గాలకు చేరుకుని ప్రార్థనలు చేసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో వజూ చేసుకునేందుకు కూడా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రేపు కేంద్ర కరువు బృందం రాక: జేసీ

అనంతపురం టౌన్, జూన్ 16: జిల్లాలో ఇంటర్ మినిస్టీరియల్ కమిటీ బృందం మంగళవారం నుంచి శుక్రవారం వరకూ పర్యటిస్తుందని, అందుకు తగ్గ ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని అధికారులకు జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్ ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జేసీ మాట్లాడారు. 2023 రబీలో నష్టపోయిన పంటలను క్షేత్రస్థాయిలో ఈ కమిటీ పరిశీలిస్తుందన్నారు. అలాగే రాష్ట్ర స్థాయి సమీక్ష కూడా ఈ కమిటీ ఇక్కడే నిర్వహిస్తుందని, ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని అన్నారు. అన్నిశాఖల అధికారులు సమయ్యంతో ఈ పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, డీపీఎం ఆనంద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

రేపు పీఎం కిసాన్ సొమ్ము విడుదల

అనంతపురం అర్బన్, జూన్ 16: పీఎం కిసాన్ అమలులో భాగంగా ఈ ఏడాదికి మొదటి విడత సొమ్మును ఈనెల 18న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విడుదల చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. 18న సాయంత్రం 4 గంటలకు పీఎం కిసాన్ సొమ్మును ప్రధాన మంత్రి డీబీటీ ద్వారా జమ చేస్తారన్నారు. అర్హులైన రైతులకు రూ.2 వేలు చొప్పున జమ అవుతుందన్నారు. కార్యక్రమాన్ని రైతు బజార్ కేంద్రంలో రైతులకు లైవ్ టెలికాస్ట్ ద్వారా ప్రదర్శించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

నేడు ఆర్థికశాఖ మంత్రి

పయ్యావుల కేశవ్ రాక

ఘన స్వాగతానికి ఏర్పాట్లు



అనంతపురం అర్బన్/ఉరవకొండ, జూన్ 16: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం జిల్లాకు వస్తున్నట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం జిల్లా సరిహద్దు గుత్తి సమీపంలోని బాటలో సుంకులమ్మ ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. గుత్తి, పామిడి, కల్లూరు మీదుగా అనంతపురంలోని తపోవనం, బళ్లారి రోడ్డు సర్కిల్ మీదుగా ఉరవకొండకు వెళ్తారన్నారు. మార్గమధ్యలో పార్టీ శ్రేణులు.. ఆయనకు భారీగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారన్నారు.

ఉరవకొండ: మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పయ్యావుల కేశవ్ ఉరవకొండకు మొదటిసారి విచ్చేస్తుండటంతో టీడీపీ నాయకులు భారీ స్వాగత ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కూడేరు మీదుగా భారీ ర్యాలీతో మధ్యాహ్నం ఉరవకొండకు చేరుకుంటారు. బళ్లారి బైపాస్ నుంచి క్లాక్‌టవర్ వరకూ నిర్వహించే ర్యాలీలో మంత్రి కేశవ్ పాల్గొననున్నారు. జిల్లాలో దారి పొడవునా మంత్రికి స్వాగతం పలికేందుకు శ్రేణులు, అభిమానులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అనంత నగరానికి అరుదైన గౌరవం

బ్రిక్స్ దేశాల మేయర్ల సదస్సుకు నగర మేయర్‌కు ఆహ్వానం

అనంతపురం క్రైం, జూన్ 16: అనంతపురం నగరానికి అరుదైన గౌరవం లభించింది. ఈ నెల 21న రష్యాలో నిర్వహించే బ్రిక్స్ దేశాల మేయర్ల సదస్సుకు హాజరవ్వాలని ఆ దేశంలోని కజాన్ మేయర్ నుంచి నగర మేయర్ మహమ్మద్ వసీంకు ఆహ్వానం అందింది. ఈ సమావేశంలో వివిధ దేశాలకు చెందిన 50 మందికి పైగా మేయర్లు హాజరవుతున్నారు. రాష్ట్రం నుంచి అనంతపురం నగర మేయర్‌కు మాత్రమే ఆ అవకాశం దక్కింది. ప్రయాణ ఖర్చులతో పాటు ఇతర సౌకర్యాల ఖర్చులను రష్యా ప్రభుత్వమే భరించనుంది.

ఆహ్వానం ఎందుకంటే...

అనంతపురం నగరానికి రష్యా దేశంతో ఉన్న అనుబంధంతోనే ఈ నగరాన్ని ఎంపిక చేశారు. 16వ శతాబ్దంలో ప్రథమ రష్యన్ యాత్రికుడు అఫానసీ నికితిన్ విజయనగర సామ్రాజ్యంలో భాగమైన అనంతపురాన్ని సందర్శించారు. ఈ సందర్శనకు సంబంధించిన అంశాలు ఇటీవల కజాన్‌లో జరిగిన అసోసియేషన్ వ్యవస్థాపక సమావేశంలో అనంతపురం ప్రాధాన్యతను గుర్తుచేశాయి. భారతదేశం నుంచి జైపూర్, క్యాలికట్, త్రిశూర్, నాగర్ కోయిల్‌తో పాటు అనంతపురం నగరాన్ని ప్రాతిపదికన ఈ నగరాన్ని తీసుకున్నారు. అందులో భాగంగా నగర ప్రథమ పౌరుడైన మేయర్‌కు ఆహ్వానం పంపారు. అనంతపురం నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం ప్రజలందరి విజయంగా భావిస్తున్నానని మేయర్ వసీం అన్నారు.

రిటైర్డ్ ఐఏఎస్ అధికారికి స్వాగతం



అనంతపురం అర్బన్, జూన్ 16: విశ్రాంతి ఐఏఎస్ అధికారి కుంటిమద్ది లక్ష్మీనారాయణకు టీడీపీ సీనియర్ నాయకులు శింగవరం రవి స్వాగతం పలికారు. ఆదివారం ఆయన జిల్లాకు వచ్చిన నేపథ్యంలో అనంతపురం నగరంలోని ఓ హోటల్‌లో ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

అలరించిన చిన్నారుల నృత్యం



నృత్యం చేస్తున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్, జూన్ 16: రామ్ డ్యాన్స్ అకాడమీ ఎనిమిదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం స్థానిక కృష్ణకళామందిర్‌లో నిర్వహించిన చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారులు పాత, కొత్త సినిమాల పాటలకు అదిరేటి స్టెప్పులతో వీక్షకులను ఉర్రూతలూగించారు. రామ్ డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు రమణ, రవికుమార్ సంయుక్త అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కత్తి విజయ్‌కుమార్, చందు, రమేష్ పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి

అనంతపురం విద్య, జూన్ 16 : రాష్ట్ర ప్రభుత్వం జీవో 117ను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం ఉపాధ్యాయ భవన్‌లో ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ.. పాఠశాలల విలీనం రద్దు చేయడం వల్ల బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియంలో బోధన సాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు వెంకటేష్, ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్ మాట్లాడుతూ.... టీచర్లపై యాప్‌ల భారం తగ్గించాలని, టీచర్ల ఇతర సమస్యలు సైతం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర పూర్వపు అధ్యక్షుడు రఘురాంరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా పూర్వ కార్యదరిశ హనుమప్ప, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, డేనియల్, గాయత్రి, బొమ్మయ్య, భాస్కర్, సతీష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తమిళనాడు వాసి మృతి

చెన్నేకొత్తపల్లి, జూన్ 16: సీకేపీకి సమీపంలోని జాతీయ రహదారి ప్రక్కన ఓ డాబా వద్ద నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ శనివారం రాత్రి ఢీ కొన్న ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా గాంధీనగర్ చిట్టిచావిడి కరుప్పూర్‌కు చెందిన శంకర్ (40) అక్కడికక్కడే మరణించాడు. ఇతను లారీ యజమాని. లారీ డ్రైవర్ రాజుతో కలిసి ఇతను తన లారీలో పెనుకొండ నుంచి అనంతపురం శనివారం రాత్రి బయలుదేరాడు. రహదారి పక్కన ఓ డాబా వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న మరో లారీ వీరు వెనకు నుంచి ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో క్యాబిన్‌లో ఉన్న శంకర్ అక్కడికక్కడే మరణించాడు. డ్రైవర్ రాజు తీవ్రంగా గాయపడగా.. స్థానికులు అతడిని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి అన్న వడివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

మొక్కలు నాటిన 'ప్రాణదాత'

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 16: బుక్కరాయసముద్రం సమీపంలోని సెంట్రల్ యూనివర్శిటీ ఆవరణలో ఆదివారం 1500 మొక్కలు నాటినట్లు ప్రాణదాత సేవా సంస్థ అధ్యక్షుడు ఎలుగు సురేష్‌కుమార్ తెలిపారు. సెంట్రల్ యూనివర్శిటీ వీసీ ఎస్ఏ కోరి, ప్లాంటేషన్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ కేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఆ సంస్థ సభ్యులు సతీష్, నాగభూషణం, ప్రతాప్, రాజేష్, సుబ్బారెడ్డి, దత్తు, మనోజ్, లింగం, హరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పశువుల సంత వద్ద పోలీసుల నిఘా

అనంతపురంరూరల్, జూన్ 16: ఎద్దులు, ఆవులు కబేళాలకు తరలించకుండా పోలీసులు అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లోని పశువుల సంత ప్రహర కాశారు. ఆదివారం యార్డులో ఎద్దులు, ఆవులు, ఎనుముల సంత జరగ్గా... మార్కెట్ ఫీజు వసూలు కేంద్రం వద్ద పోలీసులు ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు త్రీటౌన్ పోలీసులు, పశుసంవర్ధకశాఖ సిబ్బంది అక్కడే భైరాయించారు. పశువులను కబేళాలకు తరలించకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నారు.

పశువుల సంత ఆదాయం రూ.4.11 లక్షలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.4,11,600 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.2,49,250, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,62,350 ఆదాయం వచ్చిందని తెలిపారు.

కార్యవర్గం ఎంపిక



సంఘం నూతన సభ్యులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 16: పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎంపికైంది. ఆదివారం నగరంలోని మార్కండేయ దేవస్థానంలో సంఘం రాష్ట్ర నేతల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా కొంతం శివరుద్రప్ప, ప్రధాన కార్యదర్శిగా శీల వెంకటస్వామి, కోశాధికారిగా బసవతి సురేష్, మహిళా అధ్యక్షురాలిగా మఠం ప్రసన్న, కార్యదర్శిగా శీల సునీత, కోశాధికారిగా జలదుర్గం పద్మజతో పాటు పలువురు కార్యవర్గసభ్యులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జింకా సూర్యనారాయణ, కార్యదర్శి పోతుల నరసింహులు, మాజీ అధ్యక్షులు పొదరాల రవీంద్ర, నాయకులు గుర్రం యుగంధర్, సుజాత పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో సెంచరీల మోత

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 16: సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో బ్యాటర్లు సెంచరీలతో రెచ్చిపోయారు. ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో అంతర్-23 ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు కొనసాగాయి. అనంతపురం, చిత్తూరు జట్లు తలపడగా... మొదట బ్యాటింగ్ చేసిన చిత్తూరు నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 285 పరుగులు చేసింది. రుషీల్ రెడ్డి 65, తేజా రెడ్డి 51 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన అనంతపురం 46.3 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 286 పరుగులు చేసి ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. జిల్లా బ్యాటర్లు అర్జున్ టెండూల్కర్ 111 పరుగులు, యోగానంద 71 పరుగులు సాధించారు. మరో మ్యాచ్‌లో కడప, నెల్లూరురు జట్లు పోటీ పడగా.... మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 345 పరుగులు చేసింది. నిఖిలేశ్వర్ 134 పరుగులు, ఫర్హాద్‌ఖాద్రి 79 పరుగులు, సుబ్రమణ్యం 72 పరుగులు సాధించారు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కడప 22.2 ఓవర్లలో కేవలం 90 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. నెల్లూరు బౌలర్ సాకేత్ రామ్ ఐదు వికెట్లు తీసి 243 పరుగులు భారీ విజయానికి బాటలు వేశాడు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, సౌత్‌జోన్ మేనేజర్ ఖాజామొహిద్దీన్, సెలెక్టర్లు నాగినికుమార్, మాజీ రంజీప్లేయర్ షాబుద్దీన్ పాల్గొన్నారు.

విజేతలు ఏపీ, తమిళనాడు జట్లు

సౌత్‌జోన్ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల విజేతలుగా ఏపీ, తమిళనాడు జట్లు నిలిచాయి. రెండు రోజులుగా నిర్వహిస్తున్న 4వ సౌత్‌జోన్ టెన్నిస్‌బాల్ క్రికెట్ చాంపియన్‌షిప్-2024 అండర్-14 బాల, బాలికల పోటీలు ఆదివారం స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో ముగిసాయి. బాలుర విభాగంలో తమిళనాడు మొదటి స్థానంలో, కర్ణాటక ద్వితీయ స్థానం, తృతీయ స్థానంలో పాండిచ్చేరి- కేరళ నిలిచాయి. బాలికల విభా గంలో విజేతగా ఏపీ జట్టు, ద్వితీయ స్థానంలో తమిళ నాడు, తృతీయ స్థానంలో కర్ణాటక జట్లు నిలిచినట్లు రాష్ట్ర టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు.



విజేత ఏపీ బాలికల జట్టు

భక్తిశ్రద్ధలతో గాయత్రీ జయంతి



పూజలందుకుంటున్న గాయత్రీమాత, అలంకరణలో వాసవీమాత, నగర సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, జూన్ 16: వేదమాత గాయత్రి దేవి జయంతిని పురస్కరించుకుని ఆదివారం పాతూరు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అఖండ గాయత్రి హోమం నిర్వహించారు. అనంతరం వాసవి భజన మండలి ఆధ్వర్యంలో భక్తులు నగర సంకీర్తన నిర్వహించారు. ఆలయ ఆవరణంలో వేదమాత గాయత్రిదేవితో పాటు వాసవీ కన్యకాపరమేశ్వరి విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేసి పూజాదులు నిర్వహించారు. కార్యక్రమంలో పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, ఆలయ ధర్మకర్త గర్లాల నాగరాజు, పార్థం సత్యనారాయణ, శబరి వరప్రసాద్, శ్రీధర్ గుప్తా, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల సంబరాలు

చెన్నేకొత్తపల్లి, జూన్ 16: సీఎంగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం అనంతరం వృద్ధుల పింఛన్ రూ.4వేలకు పెంచుతూ సంతకం చేయడంపై పింఛన్‌దారులు హర్షం వ్యక్తం చేశారు. చెన్నేకొత్తపల్లిలోని బీసీకాలనీలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఆదివారం సాయంత్రం కేక్‌ను కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంకే అమరేంద్ర, టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు చెన్నకేశవుల గౌడ్, వడ్డేదుర్గ, నక్కా నాగరాజు, మారుతి, గోవిందు, రామాంజి, నరేంద్రరెడ్డి, కాటమయ్య, షరీఫ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు: నారాచంద్రబాబునాయుడు చిత్ర పటానికి మండల టీడీపీ నాయకులు ఆత్మకూరులో ఆదివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, మాజీ కన్వీనర్లు సూరి, వేణుగోపాల్, వెంకట నారాయణ, రవీంద్రారెడ్డి, కందుల ఓబులపతి, రామదాసు అక్కులన్న, పూల ఓబులపతి పాల్గొన్నారు.



చెన్నేకొత్తపల్లిలో కేక్‌కట్ చేస్తున్న పింఛన్‌దారులు

ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు



ఎమ్మెల్యేకు తన సమస్యలు వివరిస్తున్న వాసుదేవశాస్త్రి

అనంతపురం అర్బన్, జూన్ 16: తమ సమస్యలు పరిష్కరించాలని నగరానికి చెందిన పలువురు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను ఆదివారం విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని టీడీపీ అర్బన్ కార్యాలయం వద్ద వారు వినతి పత్రాలను అంద జేశారు. దివ్యాంగ యువకుడు వాసుదేశాస్త్రి ఎమ్మెల్యేను కలిసి.. తాను పుట్టుకతోనే పోలియోతో జీవిస్తున్నానని, చిన్నప్పుడే తండ్రి మరణించాడని, తల్లి సహకారంతో ఎంఏ ఇంగ్లీష్ లిటరేచర్ పూర్తి చేశానని అన్నారు. తనకు ఉద్యోగంతో పాటు పింఛన్, దివ్యాంగ మోటారు సైకిల్ ఇప్పించి ఆదుకోవాలని ఎమ్మెల్యేను వేడుకున్నాడు. పింఛన్, ద్విచక్రవాహనం వెంటనే అందిం చేలా చర్యలు తీసుకుం టామని, ఉద్యోగ విషయంలో తన వంతు సహాయం చేస్తాననిహామీ ఇచ్చారు. అలాగే నడిమివంక పరిసర ప్రాంతాల్లో పక్కా ఇళ్లు నిర్మించుకొని నివాస ముంటున్న తమను ఇళ్లు ఖాళీ చేయాలని నగర పాలక సంస్థ అధికారులు నోటీసులు జారీ చేశారని ఎమ్మెల్యే వద్ద బాధితులు వాపోయారు. ఎమ్మె ల్యే సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. ఏఏ ఇళ్లకు పట్టాలున్నాయి..? ఏఏ ఇళ్లు అనధి కారికంగా నిర్మించుకున్నారన్న వివరాలు పూర్తిగా సేకరించాలన్నారు. పేదలకు అన్యాయం జరగకుండా చూడాలని ఆదేశించారు.

ఆర్థిక సాయం : అనంతపురం అర్బన్ 13వ డివిజన్‌కు చెందిన ముస్లిం మహిళ షాహీనా రోడ్డు ప్రమాదంలో వికలాంగురాలిగా ఏడాదిగా మంచానికే పరిమితమైంది. రోడ్డు ప్రమాదంలో భర్తతోపాటు ఇద్దరు పిల్లలను కోల్పోయింది. ఎమ్మెల్యే ఆదివారం స్థానిక టీడీపీ నాయకులు లక్ష్మీనాయుడమ్మ, కురబ నారాయ ణస్వామి తదితర నాయకుల ద్వారా రూ.10 వేలు అందిం చారు. త్వరలో పూర్తి వికలాంగత్వం కేటగిరిలో పింఛన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ



రాప్తాడు : మండలంలోని ప్రసన్నాయపల్లిలో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి ఆదివారం పూజ పూజ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండప్ప, ఉప్పర శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ శేఖర్, స్వర్ణక్క, ధనుంజయ, తెలుగు యువత మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంపై సందిగ్ధం

అనంతపురం క్రైం,జూన్ 16: అనంతపురం నగరపాలిక కౌన్సిల్ సమావేశంపై సందిగ్ధం నెలకొంది. గత ఏడాదిలో చివరిసారిగా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఏడు నెలలు దాటినా సమావేశం నిర్వహించకపోవడంతో ఎప్పుడు నిర్వహిస్తారనే చర్చ జరుగుతోంది. ఎన్నికల కోడ్ రావడంతో రెండు నెలల్లోనూ నిర్వహించడానికి అవకాశం లేకుండా పోయింది. తొలుత ఈనెల 18న కౌన్సిల్ నిర్వహించాలని భావించారు. కానీ వాయిదా పడింది. మరోసారి ఈనెల 24 లేదా 26 తేదీల్లో నిర్వహించాలనే యోచనలో ఉన్నారు. కొత్తగా ఎన్నికైన అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నగరపాలిక కౌన్సిల్‌లో ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు. వారికి ఈనెల అసెంబ్లీ సమావేశాలు, పార్లమెంటు సమావేశాలు ఉన్నాయి. దీని వల్ల నగరపాలిక కౌన్సిల్ సమావేశం వాయిదా పడే అవకాశముంది.

ప్రభుత్వానికి సహకరిస్తాం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 16: రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వానికి నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం సంపూర్ణ సహకారం అందిస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట చెన్నప్ప అన్నారు. ఆదివారం విజయవాడలోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు వీలైనంత త్వరలో పరిష్కారమవుతాయన్న నమ్మకం ఉందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం నూతన ప్రభుత్వం చేపట్టే అన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ఉద్యోగుల పక్షాన పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు సుబ్రమణ్యం, సహాధ్యక్షుడు మద్దిలేటి, కోశాధికారి శ్రీనివాసులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలకు అనుకూలంగా కార్యాలయాలు..

అనంతపురంరూరల్, జూన్ 16: ప్రజలకు ఇబ్బందులు లేకుండా.. అందుబాటులో ఉండేలా తహసీల్దార్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బీసీ ఆర్‌దాస్ ప్రకటనలో పేర్కొన్నారు. క్లాక్‌టవర్ వద్ద ఉన్న తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలను తొలగించడంతో ప్రజలకు ఇబ్బందులు మొదలయ్యాయన్నారు. హెచ్‌ఎల్‌సీ కెనాల్ సమీపంలో కార్యాలయం ఏర్పాటు చేయడంతో ప్రజలు రూ.వందలు ఆటోలకు పెట్టుకుంటున్నారన్నారు. ప్రజలకు అకూలంగా కార్యాలయాలు ఏర్పాటు చేయాలని పలుమార్లు ఉన్నతాధికారులను కోరామని, ఇప్పటికైనా ఆ మేరకు అధికారులు చొరవ చూపాలని అన్నారు.

మహిళ మృతదేహం స్వాధీనం

రాప్తాడు, జూన్ 16: మండలంలోని ప్రసన్నాయపల్లి రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ధర్మవరం రైల్వే జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. రైల్వే గేటు సమీపంలో ఆ మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు తమకు సమచారం ఇచ్చారన్నారు. తాము స్థలానికి వెళ్లి పరిశీలించామని, మహిళ వివరాలు తెలియలేదని అన్నారు. మహిళ వయసు 40 నుంచి 50 సంవత్సరాలు ఉంటుందన్నారు. సమాచారం తెలిసిన వారు ధర్మవరం రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.



బుక్కరాయసముద్రంలో సమావేశమైన పూర్వపు విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

బుక్కరాయసముద్రం, జూన్ 16: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన అలనాటి విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం సమావేశమయ్యారు. జిలాల్లో కాకుండా మధ్యప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ.. విజయవాడ తదితర ప్రాంతాల్లో స్థిర పడ్డ నాటి 110 మంది విద్యార్థులు 34 ఏళ్ల తర్వాత నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాటి గురువులు విశ్రాంతి ప్రధానోపాధ్యాయుడు రామూర్తి, పీఈటీ ఉపాధ్యాయులు అంజినేయులు, హిందీ ఉపాధ్యాయులు వెంకటేశు, విమలమ్మ... ప్రస్తుతం ఉపాధ్యాయులు వసుంధరను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, నాగముని, మురళి, శ్యామ్ ఇందులో పాల్గొన్నారు.

రామగిరి : మండలంలోని కుంటిమద్ది ఉన్నతపాఠశాలలో 1984-85 పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం సమావేశమయ్యారు. అలనాటి గురువులు అశ్వర్థనారాయణ, విద్వాన్‌శర్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అనంత పద్మనాభం, పూర్వవిద్యార్థులు శ్రీదేవి, రామగిరి కిష్టప్ప, లక్ష్మీనారాయణ, కామేశ్వరరావు, నందగోపాల్, సులోచన, రాజశేఖర్, జయప్ప, రవి మిత్రులు పాల్గొన్నారు.



కుంటిమద్దిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఆత్మాసీతారామ ఆలయాన్ని సందర్శించిన కలెక్టర్

శింగనమల: స్థానిక పురాతనమైన ఆత్మసీతారామస్వామి దేవాలయాన్ని కలెక్టర్ వినోద్ కుమార్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. దేవాలయ ఈఓ బాబు, డిప్యూటి తహసీల్దార్ ప్రకాష్‌రావు, రామకృష్ణ అర్చకులు వారికి స్వాగతం పలికారు. కలెక్టర్ దంపతులు స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు కలెక్టర్‌కు సన్మానం చేశారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు

● పర్యవేక్షించిన కలెక్టర్, జేసీ



జేఎన్‌టీయూలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్నకలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, జూన్16: జిల్లాలో యూపీఎస్సీ (సివిల్ సర్వీసెస్) పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాకేంద్రంలో జేఎన్‌టీయూ, ఎస్కేయూ, ఎస్ఎస్‌బీఎన్, ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కళాశాలలో కలిపి ఏడు కేంద్రాలలో ఆదివారం పరీక్షలు నిర్వహించారు. మొత్తంమీద 2795 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంది. ఉదయం 1462 మంది హాజరుకాగా 1333 మంది గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం 1456 మంది హాజరు కాగా 1339 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. నీట్ పరీక్షల వివాదం నేపథ్యంలో యూపీఎస్సీ పరీక్షల నిర్వహణ విషయంలో కలెక్టర్, జేసీ కేతన్‌గార్గ్ ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షించారు. జేఎన్‌టీయేలో కలెక్టర్, ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో జేసీ పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద మెటల్ డిటెక్టర్‌లు ఏర్పాటు చేసి అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లోనికి అనుమతించారు. కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు కొనసాగించారు. జవాబు పత్రాల బుకింగ్ విషయంలో కూడా కలెక్టర్ హెడ్ పోస్టాఫీస్‌కు స్వయంగా వచ్చి బుకింగ్ తీరును పరిశీలించారు. మొత్తంమీద పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో జిల్లా యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

రేగాటిపల్లికి చేరిన సైనికుల బైక్ యాత్ర

ధర్మవరం, జూన్ 16: కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికులను స్మరించుకుంటూ భారత సైనికులు చేపట్టిన బైక్ యాత్ర ఆదివారం ధర్మవరం మండలం రేగాటిపల్లికి చేరుకుంది. సైన్యాధికారి అజయ్‌కుమార్ ఠాకూర్ మాట్లాడుతూ.. తమిళనాడులోని ధనుష్‌కోటిలో గత నెలలో బైక్‌యాత్ర ప్రారంభించామన్నారు. కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికులను స్మరించుకుంటూ, వారు దేశం కోసం చేసిన త్యాగాలను ప్రజలకు వివరిస్తూ ఈ యాత్ర చేపట్టామన్నారు.కార్గిల్ యుద్ధం జరిగి 25 ఏళ్లు పూర్తయిందన్నారు. మనాలి, లద్దాఖ్ వరకు 5వేల కిలోమీటర్లు బైక్ యాత్ర చేపడతామన్నారు.



బైక్‌యాత్ర చేపట్టిన సైనికులు

ఓట్లు వేయరా...

● వైసీపీ నేతల కక్షసాధింపు.. తాగునీరు బంద్
● అల్లాడిపోతున్న గ్రామాల ప్రజలు
● జగన్ మత్తు వీడని గ్రామ కార్యదర్శులు
● బోరు మరమ్మతులు చేయించిన టీడీపీ కార్యకర్తలు

తడాఖా చూపుతాం..!

బుక్కరాయసముద్రం, జూన్ 16: వైసీపీని ప్రజలు ఛీ కొట్టినా... ఆ పార్టీ నాయకుల తీరు మారలేదు. శింగనమల నియోజకవర్గంలో అత్యధికంగా గ్రామ పంచాయతీల్లో వైసీపీ మద్దతు సర్పంచులే ఉన్నారు. సార్వత్రిక ఎన్నికలలో ఆ పార్టీ ఓటమి చవి చూసింది. నిజ్జి జీర్ణించుకోలేక కొందరు ఆ పార్టీ సర్పంచులు, గ్రామ నాయకులు ప్రజలపై కక్షసాధిస్తున్నారు. వైసీపీకి ఓట్లు వేయకుండా టీడీపీకి ఓట్లు వేస్తారా? మా తడఖా ఏంటో చూపిస్తామని సర్పంచ్‌లు రెచ్చిపోతున్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన మరసుటి రోజు నుంచే ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా వారు వ్యవహరిస్తున్నారు. గ్రామాలకు తాగునీరు రాకుండా బంద్ చేయిస్తున్నారు. వీటితో గ్రామాల్లో కార్మికులు కాలువలు శుభ్రం చేయకుండా, చెత్త సేకరణ తదితర పనులను తాత్కాలికంగా నిలిపివేయించారు. శింగనమల నియోజకవర్గంలో పలు గ్రామ పంచాయతీలలో ప్రజలపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నా... గ్రామ సెక్రటరీలు మౌనంగా ఉండటం విశేషం. ప్రభుత్వం మారినా పలు గ్రామాల్లో కార్యదర్శులు వైసీపీ మత్తులోనే ఉన్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



బుక్కరాయసముద్రం గ్రామ సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

మేజర్ గ్రామ పంచాయతీలో తాగునీరు బంద్

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న బుక్కరాయసముద్రం మేజర్ గ్రామ పంచాయియతీలో ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే తాగునీరు బంద్ చేయించారు. దీంతో గ్రామంలోని ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలో 4 వేల ఓట్లు టీడీపీకి మెజార్టీ రావడంతో వైసీపీ నాయకులు జీర్ణించుకోలేక ఈ దుశ్చర్యకు దిగినట్లు ప్రజలు అంటున్నారు. సాధారణంగా ఒకటి రెండు చోట్ల తాగునీటి సమస్య రావడం సహజం. ఏకంగా 8 నుంచి 9 కాలనీలల్లో సమస్య ఉందనే విధంగా చిత్రీకరించారు. పంచాయతీలో 40 వేల జనభా ఉంది. ప్రస్తుతం కొళాయిల్లో నీరు రాకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. నీటి సమస్య తట్టుకోలేక గ్రామ సచివాలయం వద్ద మహిళలు ధర్నా చేపట్టారు. అయినా అధికారులలో ఎలాంటి స్పందన రాలేదు. వీటితో పాటు పంచాయతీ కార్మికులు డ్రైనేజీలు, రోడ్లు శుభ్రం చేయడానికి రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు ముందు నీరు వచ్చేదని, ప్రస్తుతం రాకుండా చేశారని విమర్శిస్తున్నారు. నియోజకవర్గంలో వైసీపీ గ్రామ సర్పంచ్‌లు ఉన్న గ్రామాల్లో తాగునీటి సమస్య వచ్చినా, ఇతర సమస్యలు వచ్చినా అధికారులు, సర్పంచులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.



పుట్లూరులో ట్యాంకర్లతో నీటిని అందిస్తున్న టీడీపీ నాయకులు

బోరును మరమ్మతు చేయించిన టీడీపీ కార్యకర్తలు

టీకేఎస్‌లోని జనచైతన్య కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పలు సార్లు ప్రజలు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు పట్టించుకోలేదు. కాలనీలో అత్యధికంగా ముస్లిం మైనార్టీ వర్గాలు నివసిస్తున్నారు. సోమవారం బక్రీద్ పండుగ నేపథ్యంలో ఇబ్బందుపడుతున్నారని వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులును వేడుకున్నారు. ఎన్నికల్లో ఓట్లు వేయలేదని ఉద్దేశంతోనే తాగునీటి బోరు మరమ్మతు చేయలేదని అంటున్నారు. టీడీపీ కార్యకర్తలు రంగమ్మ, రఫీ, వలీ సొంత డబ్బు పెట్టి తాగునీటి బోరుకు మరమ్మతు చేయించి నీటిని సరఫరా చేయించారు. వీటితో పాటు పుట్లూరు మండల కేంద్రంలో గతంలో తాగునీటి సమస్య నెలకొంది. గ్రామ పంచాయతీ సర్పంచ్ వైసీపీకి చెందిన వాడు కావడంతో అక్కడ ఉన్న స్థానిక నాయకులు తాగునీటి ట్యాంకర్ల ద్వారా ప్రజలకు గతంలో నీటిని అందించేవారు. ఎన్నికల ఫలితాలు అనంతరం ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని అందించడం లేదు. స్వయంగా టీడీపీ నాయకుడు పుల్లారెడ్డి సొంత డబ్బుతో ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని అందిస్తున్నారు.



బోరుకు మరమ్మతు చేయిస్తున్న టీడీపీ కార్యకర్తలు

కక్షసాధింపు చర్యలుకు దిగితే సహించం



నియోజకవర్గంలో వైసీపీకి ఓట్లు వేయలేదని ప్రజలపై కక్షసాధింపు చర్యలకు దిగితే సహించే ప్రసక్తిలేదు. అధికారులు ఇంకా వైసీపీ మత్తులో ఉంటే వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం. వెంటనే తాగునీరు బంద్ చేసిన గ్రామాల్లో నీటిని ఇవ్వాలి. పంచాయతీ కార్మికులు కూడా ప్రజలకు అనుగుణంగా పని చేయాలి. సర్పంచ్‌లు చెప్పిన విధంగా చేయవద్దద. ఎన్నికలలో వైసీపీకి బుద్ధిచెప్పినా వారి తీరు మారలేదు.

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ఎమర్జెన్సీకి చికిత్స ఏదీ..?

దయనీయంగా పెద్దాస్పత్రి క్యాజువాలిటీ, ఐసీయూ

విరిగిపోయిన మంచాలు.. పనిచేయని ఏసీలు

ఇంటి నుంచే ఫ్యాన్లు తెచ్చుకుంటున్న రోగులు



ఐసీయూలో ఏసీలు పనిచేయక ఇంటి నుంచే ఫ్యాన్ తెచ్చుకుని ఉపశమనం పొందుతున్న రోగి

అనంతపురం టౌన్, జూన్ 16: జిల్లా సర్వజన ఆసుపత్రి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ప్రైవేటు ఆసుత్రులకు వెళ్లి చికిత్సలు పొందాలంటే వేలకు వేలు ఖర్చు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎలాంటి చికిత్సలైనా ఉచితంగా పొందవచ్చని పెద్దఎత్తున రోగులు వస్తుంటారు. రోజుకు రెండు వేల మంది వరకు ఆసుపత్రికి వచ్చి వైద్యం పొందుతున్నారు. దాదాపు 1200 మంది వరకు అడ్మిషన్ పొంది చికిత్సలు తీసుకుంటున్నారు. దీన్నిబట్టే జిల్లా ఆసుపత్రికి రోగులు ఏ స్థాయిలో వస్తారో అర్థమవుతుంది. ఇలాంటి ఆసుపత్రి పట్ల వైసీపీ ప్రభుత్వంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చేశారన్న విమర్శలు ఉన్నాయి. సాధారణ చికిత్స విభాగాల మాట అటుంచితే ప్రాణాప్రాయ స్థితిలో రోగులు వస్తే కాపాడేందుకు ఏర్పాటు చేసిన క్యాజువాలిటీ, ఐసీయూ, ఎమర్జెన్సీ విభాగాల పరిస్థితి దుర్భరంగా ఉంది.

రోగులు ఫుల్.. వసతులు నిల్..

ఆసుపత్రికి ప్రాణాప్రాయస్థితిలో ప్రతిరోజు పదుల సంఖ్యలోనే కేసులు వస్తుంటాయి. ప్రమాదాలకు గురైన వారితో పాటు విషం తాగిన కేసులు, పాము, తేలుకాటుకు గురైన వారు, గుండె, బ్రెయిన్ తదితర కేసులు ఇక్కడికి వస్తుంటాయి. తొలుత క్యాజువాలిటీలో చేరతారు. అక్కడ ప్రథమ చికిత్సలు అందించి పక్కనే ఉన్న ఐసీయూలోకి పంపిస్తారు. క్యాజువాలిటీలోను, ఐసీయూలోను ఒక్కొక్క విభాగంలో 20 పడకలు మాత్రమే ఉన్నాయి. వచ్చే రోగులకు ఈ పడకలకు ఏమాత్రం సరిపోవడంలేదు. డాక్టర్లు నిర్లక్ష్యంగా ఏదో అరకొర వైద్యం అందించి ఏం ఫర్వాలేదు, బాగుందని చెప్పి పంపిస్తున్నారు. ఇటీవల అనంతపురం రూరల్‌కు చెందిన ఓ ఆటో డ్రైవర్ ప్రమాదానికి గురికాగా ఎమర్జెన్సీ చికిత్స కోసం క్యాజువాలిటీలో కుటుంబ సభ్యులు చేర్పించారు. అక్కడ ఉన్న డాక్టర్, సిబ్బంది అతడిని పరీక్షించి సూదులువేసి, మందులు రాసిచ్చి బాగున్నాడని, ఏమి ఇబ్బంది లేదని చెప్పి పంపించారు. ఇంటికి పోయిన తర్వాత అర్ధరాత్రి మళ్లీ సీరియస్ కావడంతో తిరిగి ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఇక్కడికి వచ్చిన కాసేపటికే ఆటోడ్రైవర్ మరణించాడు. ఆసుపత్రి డాక్టర్లు బలవంతంగా బాగుంది పొమ్మంటే పోయామని, వాళ్ల నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని ఆటో డ్రైవర్ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఇలాంటివి ఎన్నో ఉంటాయని, పడకల కొరత వల్లే డాక్టర్లు, సిబ్బంది ఇలా పంపించేసి వారి ప్రాణాలు తీస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

విరిగిన మంచాల కాళ్లు.. దిష్టిబొమ్మల్లా ఏసీలు..

ఎమర్జెన్సీ విభాగాలంటే సౌకర్యాలు మంచిగా ఉండాలి. అధికారులు, డాక్టర్లు వసతుల విషయంలో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైన మరమ్మతులు చేయించాలి. పాలకులు సైతం వీటిపై దృష్టిసారించి ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ వైసీపీ ఐదేళ్ల పాలనలో కేవలం మాటలకే ఇవన్నీ పరిమితమైపోయాయి. అసలే మంచాలు తక్కువ ఉంటే అందులో కొన్నింటికి కాళ్లు ఊడిపోయాయి. మంచాలు కిందకు పడకుండా సపోర్టుగా ఇనుప స్టూల్స్ పెట్టి వాటిలోనే రోగులను ఉంచి వైద్యం అందిస్తున్నారు. ఎమర్జెన్సీ అంటేనే తప్పనిసరిగా ఏసీలు ఉండాలి. కానీ ఈ సర్వజన ఆసుపత్రిలో ఏసీలు కనిపిస్తున్నా అవి ఏళ్ల తరబడిగా పనిచేయలేదు. దిష్టి బొమ్మల్లా కనిపిస్తున్నాయి. ఏసీలు పనిచేయకపోవడంతో చాలామంది రోగులు ఇళ్ల నుంచి ఫ్యాన్లు తెప్పించుకొని ఉపశమనం పొందుతున్నారు. ఇటీవల దాదాపు రెండున్నర కోట్లతో ఆసుపత్రి, వైద్యకళాశాల, సూపర్ స్పెషాలిటీలలో మరమ్మతుల కోసం ఖర్చు పెట్టామని వైద్యాధికారులు, ఇంజనీర్లు అంటున్నారు. ఎమర్జెన్సీ విభాగాల్లో నెలకొన్న సమస్యలు కనిపించడంలేదా అనే విమర్శలు వస్తున్నాయి.



అనంత ఆసుపత్రిలోని క్యాజువాలిటీ విభాగంలోకి రోగులను తీసుకెళుతున్న సిబ్బంది, కుటుంబసభ్యులు



ఐసీయూలో మంచం కాళ్లు విరిగిపోవడంతో ఇనుప స్టూల్ సపోర్టుగా పెట్టిన దృశ్యం

కొత్త పాలకులపైనే ఆశలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు అందరు వారే ఉన్నా ఆసుపత్రి అభివృద్ధి విషయంలో పట్టించుకోలేదు. అడపాదడపా స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి వచ్చినా తూతూ మంత్ర ఆదేశాలతో కాలం గడిపారన్న ఆరోపణలు మూటకట్టుకున్నారు. ఎన్నికల ముగిసాయి, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త పాలకులైనా జిల్లాకు గుండెకాయలాంటి పెద్దాసుపత్రిపై ప్రత్యేక దృష్టి పెట్టి పేదరోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చూస్తారని అనంత జనం ఎదురు చూస్తున్నారు.

విలీనం నష్టాన్ని భర్తీ చేయాలి

● ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



మాట్లాడుతున్న పలిశెట్టి దామోదరరావు

అనంతపురం కల్చరల్, జూన్ 16: ఏపీఎస్ ఆర్టీసీని గత వైసీపీ ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత ఉద్యోగులకు కలిగిన నష్టాన్ని నూతన ప్రభుత్వం భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వీకే భవన్‌లో నిర్వహించిన ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రాంతీయ కమిటీ సమావేశంలో ఆయన మా ట్లాడారు. విలీనం వల్ల ఉద్యోగులు పాత పెన్షన్ విధానానికి దూరమవడం... ఆర్టీసీలో దశాబ్దాలుగా ఉద్యోగుల భాగస్వామ్యంతో ఉన్న ఎస్ఆర్‌బీఎస్ తదితర పెన్షన్ పథకాన్ని రద్దు చేయడం.. రెఫరల్ ఆస్పత్రుల్లో వైద్య సౌకర్యాలు పొందే వెసులుబాటును తొలగించడం వల్ల ఉద్యోగులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారన్నారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తుందన్న నమ్మకంతో ఉన్నామని, భవిష్యత్‌లో ఉద్యోగుల నమ్మకాలు వమ్ము చేయకుండా న్యాయం చేయాలని కోరారు. అనంతరం వైఎస్ఆర్ యూనియన్ నుంచి 90 మంది సభ్యులు ఎంప్లాయీస్ యూనియన్‌లోకి చేరారు. వారికి దామోదరరావు ఎర్ర కండువాలు కప్పి స్వాగతించారు. ఈయూ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జీవీ నరసయ్య, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్‌రావు, నబిరసూల్, జోనల్ అధ్యక్ష కార్యదర్శులు కుమార్, రాజశేఖర్, ఏజీటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, జిల్లా కార్యదర్శి రాజేష్‌గౌడ్, కొండయ్య, ఓబుళరత్నం, కల్లప్ప, జీవైపీ రావు, జీవీ నరసయ్య, భాస్కర్‌రెడ్డి, గోపాల్, వెంకటేశ్వర్లు, సోమశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

ఫ్లెక్సీలను చించేసిన దుండగులకు పిండప్రదానం

ధర్మవరం, జూన్ 16: పట్టణంలోని 9వ వార్డులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించేసిన దుండగులకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పిండప్రదానం చేశారు. రాష్ట్రంలో ఘన విజయం సాధించిన కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యేగా సత్యకుమార్‌యాదవ్ గెలుపొందిన సందర్భంగా 9వ వార్డులో జనసేన నాయకుడు అడ్డగిరి శ్యాంకుమార్ ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు. ఇది జీర్ణించుకోలేక కొందరు దుండగులు చించేశారు. ఇందుకు నిరసనగా ఫ్లెక్సీని చించేసిన దుండగులకు అర్చకుడిని పిలిపించి పిండప్రదానం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు ఎవరూ పాల్పడకుండా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జనసేన నాయకులు తెలిపారు. బెస్త శ్రీనివాసులు, దుర్గమ్మ, ముత్యాలప్ప, రామాంజి, సుధాకర్ రెడ్డి, భవానిశంకర్, తలారిప్రతాప్, షఫి, లక్ష్మీనారాయణ, అఖిల్, భగవాన్, రామ్‌చరణ్, ప్రవీణ్‌యాదవ్ పాల్గొన్నారు.



పిండప్రదానం చేస్తున్న జనసేన నాయకులు

నిరుపేదల్లో.. చిగురిస్తున్న ఆశలు..!



కొటిపి వద్ద ఆగిపోయిన టిడ్కో ఇళ్ల నిర్మాణం

● గత టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు
● వైసీపీ పాలనలో నిర్లక్ష్యం
● కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో నిరుపేదల్లో ఆనందం

హిందూపురం, జూన్ 16: పట్టణంలో ఎన్నో ఏళ్లుగా సొంతిల్లులేక వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. అలాంటి వారికోసం గత తెలుగుదేశం హయాంలో ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి శ్రీకారం చుట్టింది. పట్టణంలోని 3 వేల మందికిగాను కొటిపి సమీపంలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2018 జనవరి 10న ఇళ్ల నిర్మాణానికి అప్పటి, ఇప్పటి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ భూమిపూజచేసి పనులు ప్రారంభించారు. 2019 ఎన్నికలు జరిగే నాటికి 70శాతం పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం మారడంతో ఈ ఐదేళ్లు టిడ్కో ఇళ్ల గురించి పట్టించుకున్న పాపాన వైసీపీ పాలకులు పోలేదు. దీంతో ఇళ్ల నిర్మాణం కోసం అక్కడున్న కొన్ని పరికరాలు దొంగలెత్తుకెళ్లారు. ఈ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలవడం బాలకృష్ణ ఎమ్మెల్యే కావడంతో మరోసారి టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. దీనికితోడు తెలుగుదేశం అధికారంలోకి వస్తే టిడ్కో ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇదే మాటను బాలకృష్ణ కూడా చెప్పారు. దీంతో ప్రభుత్వం మారడం ఎమ్మెల్యే బాలకృష్ణ రావడంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తయి మాకు అప్పగిస్తారని వేయి కళ్లతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

గత టీడీపీ హయాంలో నిర్మాణం

తెలుగుదేశం హయాంలో పట్టణానికి సంబంధించి కొటిపి వద్ద మొదటి దశ కింద 2050ఇళ్లు, రెండోదశ 6500 ఇళ్ల నిర్మాణం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. అందరికీ ఇల్లు పథకం కింద టిడ్కో సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీ ప్లస్ 3 తరహాలో అపార్ట్‌మెంట్‌లో ఇళ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో 300, 365, 430 చదరపు అడుగుల్లో లబ్ధిదారుల వాటా కింద ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో 2736 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించి పనులు మొదలు పెట్టారు. మొదట్లో లబ్ధిదారులు రాకపోయినా పాలకులు దీనిపై అవగాహన కల్పించారు. దీనివల్ల లబ్ధిదారులు డీడీలు చెల్లించారు. 300చ.అడుగులకు 1104మంది, 365చ.అ.లకు 1355, 430చ.అడుగులకు 288మంది డీడీలు చెల్లించారు. దీనికోసం 2516 మందికి ఇళ్లు కేటాయించారు. వారికి బ్యాంక్ లింకేజీ కింద 380 మందికి పలు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించారు. అంతేకాక డీడీలు ఇప్పటి వరకు కట్టించుకున్నవాటిని వెనక్కు ఇవ్వలేదు. ఇళ్లు అప్పగించలేదు. దీంతో టీడీపీ కాలంలో చేపట్టిన పనులే తప్ప ఒక్క అంగుళం పనికూడా చేయలేదు. వైసీపీ పాలనంతా టిడ్కో ఇళ్లపై నిర్లక్ష్యం వహించారు. దీంతో ఐదేళ్లుగా ఇళ్ల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

కూటమి ప్రభుత్వంతో నిరుపేదల్లో ఆనందం

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఎమ్మెల్యే బాలకృష్ణ మూడోసారి గెలవడంతో పట్టణానికి చెందిన లబ్ధిదారులు ఆనందం వెల్లివిరుస్తోంది. మరీ ముఖ్యంగా నిరుపేదలు బాడుగలు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్న వారు టీడీపీ గెలుపుతో ఇక మాకు సొంతింటికల నెరవేరే సమయం ఆసన్నమైందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు గుర్తించి మాకు ఇళ్లు అప్పగిస్తారని ఎదురుచూస్తున్నారు. అయితే వైసీపీ పాలనలో డెడ్‌లైన్‌లు పెట్టారు తప్ప ఇళ్ల నిర్మాణాలు చేపట్టలేదు. దీనివల్ల నిరుపేదలు దానిపై ఆశలు వదులుకున్నారు. వైసీపీ కాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో ఇక్కడున్న పరికరాలు చోరీకి గురికావడమేకాక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇక ఇళ్ల నిర్మాణాలపై బాలయ్య దృష్టిసారిస్తారని నిరుపేదలు చెప్పుకుంటున్నారు.

పేట్రేగిపోతున్న మట్టి మాఫియా

- కొండను తొలిచి... అక్రమంగా మట్టి విక్రయాలు
- భైరవకొండ ఆనవాళ్లు లేకుండా చేస్తున్న వైనం



భైరవ కొండపై అక్రమంగా మట్టిని ట్రాక్టర్‌లో నింపుతున్న ఎక్స్‌కవేటర్

యాడికి, జూన్‌16: మండలంలో మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. భైరవ కొండను తొలిచి మట్టి విక్రయాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. దీంతో యాడికిలో భైరవకొండ ఆనవాళ్ల కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. కొందరు ఆదివారం యాడికిలోని భైరవకొండను ఎక్స్‌కవేటర్‌తో తొలిచి మట్టి అక్రమ రవాణా చేశారు. మట్టి అక్రమ రవాణా చేస్తున్న వారిని సమీప ప్రాంతంలోని కాలనీవాసులు ప్రశ్నిస్తే మీకెందుకు అంటూ వారిపై దౌర్జన్యానికి దిగినట్లు కాలనీవాసులు తెలిపారు. భైరవ కొండపై మట్టి అక్రమ రవాణా చేస్తున్న వారిపై అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో పేట్రేగిపోతున్నారు.

ట్రాక్టర్ మట్టి రూ. వెయ్యి నుంచి రూ.1500

భైరవకొండపై మట్టి తవ్వకాలు చేపట్టరాదని అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఆ బోర్డును తొలగించి భైరవ కొండను తవ్వేస్తున్న మట్టి మాఫియా ట్రాక్టర్ మట్టి వెయ్యి రూపాయల నుంచి రూ.1500 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి మాఫియాకు వ్యతిరేకంగా ఎవరైనా అధికారులకు ఫిర్యాదు చేస్తే రాజకీయ నాయకులు అడ్డుతగులుతున్నారు. మరికొందరు భైరవ కొండను చదును చేసి ఆక్రమించే దిశగా పనులు చేపడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భైరవకొండపై మట్టి అక్రమ రవాణాకు కళ్లెం వేసి భైరవకొండ పరిరక్షణ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కొండను తొలిచిన వైనం

అమెరికాలో ఎన్‌ఆర్‌ఐల సంబరాలు



వేడుకల్లో పాల్గొన్న తెలుగు ఎన్‌ఆర్‌ఐలు

పుట్లూరు, జూన్‌16: ఏపీలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో తెలుగు ఎన్‌ఆర్‌ఐలు ఆదివారం ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. అమెరికాలోని సౌత్ కరోలినా రాష్ట్రంలోని పార్మిల్సిటీలో సుమారు 600మంది వేడుకల్లో పాల్గొన్నారు. జూమ్‌కాల్‌లో ఏపీలోని పలువురు ప్రజాప్రతినిధులతో మాట్లాడుతూ సంతోషాన్ని పంచుకున్నారు. అనంతరం కార్లతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐలు పొత్తూరి రవినాయుడు, పురుషోత్తంచౌదరి, మహేష్ సూరపనేని, వెంకట్ మలపాటి, సచ్చింద్ర, వెంకట్ సూర్యదేవరా, ప్రేమ్ పయ్యావుల, మధుకర్, పురుషోత్తం మాలది, ప్రదీప్ పాల్గొన్నారు.

బక్రీద్ పండుగకు గట్టి బందోబస్తు

గుత్తి,జూన్‌16: బక్రీదు పండుగను ప్రశాంతంగా నిర్వహించుకునేలా చూడాలని డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గుత్తి, గుత్తిఆర్‌ఎస్, గాంధీ సర్కిల్, పత్తికొండ రోడ్డు సర్కిల్‌ను పరిశీలించి పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నబీరసూల్, పశువర్థశాఖ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఫుడ్ కార్పొరేషన్‌లో నియామకం

గుంతకల్లుటౌన్, జూన్ 16: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కన్సల్టేటివ్ కమ్యూనిటీ సభ్యురాలిగా పట్టణానికి చెందిన బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసినట్లు ఆదివారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఇతర నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మిద్దెపై నుంచి పడి యువకుడికి గాయాలు

గుత్తి, జూన్‌16: పట్టణంలోని సూరశింగనపల్లి కాలనీలో నివాసముంటున్న లోకేష్ అనే యువకుడు మిద్దెపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. లోకేష్ రాడ్ వెండర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యం మత్తులో మిద్దెపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. చికిత్స నిమిత్తం అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురంకు తరలించారు.

బియ్యం గోడౌన్ తనిఖీ



పంచదార ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారి

తాడిపత్రిటౌన్, జూన్‌16: పట్టణ సమీపంలోని పప్పూరురోడ్డులో ఉన్న సివిల్‌సప్లై గోడౌన్‌ను ఆదివారం జిల్లా సివిల్‌సప్లై కార్పొరేషన్ మేనేజర్ రమేశ్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గోడౌన్‌లోని స్టాక్‌ను వాటికి సంబంధించిన రికార్డులను సరిచూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోడౌన్‌లోని సరుకుల నిర్వహణ సరిగా లేదని ఫిర్యాదు రావడంతో తనిఖీ చేశామన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఏమైనా తప్పులు జరిగితే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తూకాల్లో తేడాలు ఉన్న వాటిని జిల్లా కేంద్రానికి తరలించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట గోడౌన్ అధికారి శంకరయ్య, ముత్యాల్‌రెడ్డి, సివిల్‌సప్లై అధికారి రాజా తదితరులు ఉన్నారు.

లాభాల బాటలో గుత్తి టౌన్ బ్యాంక్

- బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్

గుత్తి, జూన్ 16: తమ బ్యాంకు ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.2.66కోట్లు లాభాల బాటలో నడుస్తున్నట్లు ది గుత్తి కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్ పేర్కొన్నారు. పట్టణంలోని వసుధ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బ్యాంక్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే గుత్తి, గుత్తిఆర్‌ఎస్ బ్రాంచ్‌ల వద్ద ఏటీఎం కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆరు నెలల కిందట పామిడిలో ఏర్పాటు చేసిన బ్రాంచ్‌లో రూ.2.79కోట్ల డిపాజిట్లు, అడ్వాన్సు రూపంలో రూ.5.55కోట్లు, రూ.8.5కోట్లకుపైగా వ్యాపారం జరిగిందన్నారు. టౌన్ బ్యాంక్‌లలో లాకర్ సౌకర్యం కూడా ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో సీఈఓ మహేశ్వర ప్రసాద్, ఉపాధ్యక్షుడు రామ్మోహన్, డైరెక్టర్లు కృష్ణ, మధుసూదన్‌గుప్త, వెంకటేష్, మహబూబ్, నాగరాజు, వీరన్న, దాదా, రంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టౌన్‌బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్‌జిలాన్

చికెన్ కోసం హత్య

డీ.హీరేహాళ్, జూన్ 16: చికెన్‌కూర ఇవ్వలేదన్న కోపంతో ఓ వ్యక్తిని బండరాయితో మోది హత్య చేసిన సంఘటన మండలంలోని మురడి గ్రామంలో ఆదివారం జరిగింది. ఈ ఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు... మురడి గ్రామానికి చెందిన హనుమంతప్ప కుమారుడు మురిడప్ప(45) పదేళ్లుగా ఆలయ ప్రాంగణంలో స్వీపర్‌గా పని చేస్తున్నాడు. ఆలయం చుట్టు పక్కల పనులు చేసుకుంటూ అక్కడే ఉన్న బంధువుల ఇళ్లలో భోజనాలు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో చికెన్ తెచ్చుకొని ఆలయం పరిసర ప్రాంతంలో ఉన్న నీటిట్యాంక్ వద్ద వండుకున్నాడు. ఇదే సమయంలో అదే గ్రామానికి చెందిన ఏసురాజు అక్కడికి వెళ్లాడు. చికెన్ కూర తనకూ కొంచెం ఇవ్వాలని అడిగాడు. దానికి మృతుడు మురిడప్ప నసేమిరా అన్నాడు. ఈక్రమంలోనే ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన ఏసురాజు అక్కడే ఉన్న బండరాయితో మురిడప్ప తలపై గట్టిగా మోదాడు. దీంతో మురిడప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. మురిడప్ప పినతల్లి పెన్నక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి పరిశీలించారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

ఉరవకొండ,జూన్‌16: అరటి పండ్ల బాక్సు కింద ఉంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సెబ్ పోలీసులు పట్టుకున్నారు. 2400లీటర్ల మద్యాన్ని, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గోవా నుంచి కర్నూలు జిల్లాకు తరలిస్తుండగా విడపనకల్లు మండలం కరకముక్కల క్రాస్ వద్ద మద్యాన్ని పట్టుకున్నట్లు ఏఈఎస్ శ్రీరామ్ తెలిపారు. కర్నూలు జిల్లాకు చెందిన కృష్ణ గౌడ్ బొలెరో వాహనంలో అరటి పండ్ల బాక్సుల కింద మద్యాన్ని ఉంచి తరలిస్తున్నాడని తెలిపారు. అతడి నుంచి 1920 క్వార్టర్ బాటిళ్లు, 480 ఫుల్‌బాటిళ్ల స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటి విలువ రూ.3లక్షలు దాకా ఉంటుందని తెలిపారు. మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏఈఎస్

మద్యం స్వాధీనం

యల్లనూరు, జూన్‌16: మండలంలోని తిమ్మంపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి నుంచి ఆదివారం ఏపీకి చెందిన 96మద్యం బాటిళ్ల, కర్ణాటకకు చెందిన 89 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఫణీంద్ర తెలిపారు. తిమ్మంపల్లితోపాటు పరిసర గ్రామాల్లో అక్ర మంగా మద్యం తెచ్చి విక్రయిస్తున్నాడన్న సమాచారంతో సిబ్బందితో దాడి చేసి నిందితున్ని అరెస్ట్ చేశారన్నారు. కారు, సెల్‌ఫోన్ సీజ్ చేశామని తెలిపారు. నిందితున్ని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

వాసవీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



గుత్తి,జూన్‌16: పట్టణంలోని వాసవీ గర్భాలయ నిర్మాణం, వాసవీ విగ్రహాల ప్రతిష్ఠ జరిగి 120 సంవత్సరాలు అయిన సందర్భంగా ఆదివారం అర్చకులు వాసుదేవశర్మ ఆధ్వర్యంలో వాసవీ మాత ఉత్సవ విగ్రహాలకు ఉదయం పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి అర్చన, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుంతల రోడ్లపై నరక ప్రయాణం



గుంతలమయమైన గుత్తిరోడ్డు



రాయలచెరువు వద్ద గుంతలమయమైన గుత్తిరోడ్డు

యాడికి, జూన్‌16: గుంతలమయమైన రోడ్లకు ఏళ్లతరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం ఆ రోడ్లపై మోకాలి లోతు గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు నరకాన్ని అనుభవిస్తున్నారు. యాడికి నుంచి తాడిపత్రికి వెళ్లే రహదారి మొత్తం గుంతలమయమైంది. ఈ రహదారిపై బస్సులు వెళ్లాలంటే టైర్లు మొత్తం గుంతల్లో మునిగి పుట్‌బోర్డు రోడ్డుకు తగులుతుండటం గమనార్హం. యాడికి నుంచి గుత్తికి వెళ్లే రోడ్డులో రాయలచెరువు రైల్వేగేట్ సమీపంలో రోడ్డంతా గుంతలమయమైంది. చినుకు రాలితే చాలు రోడ్డుపై గుంతలు కుంటలను తలపించే విధంగా ఉంటున్నాయి. అటువైపు వెళ్లాలంటేనే వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. అధికారులు రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

మంత్రికి అభినందన



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను హైదరాబాదులోని ఆయన స్వగృహంలో టీడీపీ నాయకులు నాగేంద్ర, బాబు, రంగనాథ్ ఆదివారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, అభినందనలు తెలిపారు. - ఉరవకొండ

ఆర్థిక మంత్రికి ఘనంగా స్వాగతం పలకండి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్


విలేకరులతో మాట్లాడుతున్న వెంకటశివుడుయాదవ్

గుత్తి, జూన్ 16: రాష్ట్ర ఆర్థికశాఖ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తొలిసారిగా అనంతపురం జిల్లాకు వస్తున్న సందర్భంగా గుత్తి పట్టణ శివారులో టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలకాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక నివాసంలో ఆయన గుమ్మనూరు నారాయణతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం జిల్లాకు వస్తున్న సందర్భంగా పట్టణ శివారులో వారికి సోమవారం ఘన స్వాగతం పలుకుతున్నామన్నారు. ఉదయం 10గంటలకు బాటసుంకులమ్మ దేవాలయం వద్దకు చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. గుత్తి, పామిడి, కల్లూరు మీదుగా అనంతపురం నగరంలో జాతీయ రహదారి తపోవనంకు 12 గంటలకు చేరుకుంటారన్నారు. అక్కడ మంత్రికి ఘనస్వాగతం పలికిన అనంతరం బళ్లారి రోడ్డు జంక్షన్‌మీదుగా ఉరవకొండకు బయలుదేరుతారన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు నారాయణస్వామి, సుధాకర్‌నాయుడు, శ్రీనివాసులు, ప్రతాప్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పంట కాలువలు



ముళ్ల కంపలతో నిండి, శిథిలావస్థకు చేరిన దేవగిరి, హరేసముద్రం గ్రామాల చివరి ఆయకట్టుకు సాగునీరు అందించే కాలువ

బొమ్మనహాళ్, జూన్ 16: హెచ్చెల్సీ ప్రధాన ఎగువ కాలువతో పాటు డిస్ట్రిబ్యూటరీ కాలువల పరిస్థితి అధ్వానంగా మారింది. తక్షణమే కాలువల మరమ్మతులు చేపట్టకపోతే తుంగభద్ర జలాలు వచ్చిన తర్వాత ఉధృతికి కాలువలు తెగిపోయే ప్రమాదం ఉంటుందని మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. గోవిందవాడ, తారకాపురం, కళ్ళుహోళ, బొల్లన గుడ్డం గ్రామాలకు సాగునీరు అందించే 9వ డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా 10 వేల ఎకరాలు సాగవుతోంది. ఈ కాలువ ఇరువైపులా పూర్తిగా ధ్వంసం అయిపోయి, కంపచెట్లు పెరిగిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ డిస్ట్రిబ్యూటరీ కాలువ ద్వారా చివరి ఆయకట్టు రైతులకు నీరు అందే పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని రైతులు వాపోతున్నారు. హరేసముద్రం, దేవగిరి గ్రామాల చివరి ఆయకట్టుకు నీరు అందించే కాలువ పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని సాగునీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. డిస్ట్రిబ్యూటరీ కాలువలు అధ్వానంగా ఉండటం వల్ల సాగునీరు అందడం ప్రశ్నార్థకంగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, జూన్16: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన చాంద్‌బాషా (40) ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లారీ క్లీనర్‌గా పని చేసే చాంద్‌బాషా మద్యానికి బానిసై భార్య మహబూబ్‌బీతో తరచూ గొడవపడుతుండేవాడు. ఈక్రమంలో ఆమె పుట్టింటికి వెళ్లడంతో ఒంటరిగా జీవిస్తున్నాడు. దీంతో జీవితంపై విరక్తిచెందిన చాంద్‌బాషా మూడురోజులక్రితమే ఇంటిలోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం నుంచి వాసన రావడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



చంద్రబాబు ప్రమాణ స్వీకారం.. చారిత్రాత్మక ఘట్టం

కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును పూలమాలలతో సత్కరిస్తున్న ఉద్యోగులు

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 16: కూటమి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చారిత్రాత్మక ఘట్టం అని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. పలువురు ఉపాధ్యాయులు ఆదివారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఉపాధ్యాయులు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. స్థానికంగా ఉపాధ్యాయులకు నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. పట్టణ శివారులోని ఫారెస్టులో పట్టణ ప్రజలు ఆహ్లాదకరంగా ఉండటానికి పార్కును కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తున్న తరుణంలో ఉచితంగా శిక్షణ కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. దీంతో ఉపాధ్యాయులు చప్పట్లతో ఆయన్ను అభినందించారు. మున్సిపాల్టీలో ఉన్న సమస్యలు అన్నింటిని తీరుస్తూ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మొక్కను నాటి నీరుపోస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తదితరులు

నగరవనం పనులు త్వరగా పూర్తి చేయండి

కళ్యాణదుర్గం: గత తెలుగుదేశం ప్రభుత్వం మంజూరు చేసిన నగరవనం పనులను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇప్పుడు ఆ పనులను వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచించారు. ఆదివారం పట్టణంలోని బళ్లారి రోడ్డు వద్ద ఉన్న నగరవనం పనులను ఆయన పరిశీలించారు. ఆ ప్రాంతంలో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కలకు నిరంతరం నీరందించి నగరవనం అభివృద్ధికి పాటుపడాలని అధికారులు, అటవీ సిబ్బందికి సూచించారు. పర్యావరణాన్ని పరిరక్షించుకునే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పట్టణంలో కూడా మొక్కల పెంపకాన్ని విరివిగా చేపట్టాలన్నారు. పట్టణమంతా పచ్చదనంతో కళకళలాడాలన్నారు ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇద్దరు పిల్లలకు గాయాలు


రమణా రెడ్డి (ఫైల్‌ఫొటో)

గుత్తిరూరల్,జూన్ 16: మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రమణా రెడ్డి (45) మృతి చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. పామిడికి చెందిన రమణా రెడ్డి తన కుమారుడు లక్ష్మీకాంతరెడ్డి, తన బావమరిది కుమారుడు నరసింహారెడ్డితో కలిసి ద్విచక్రవాహనంపై బాట సుంకులమ్మ దర్శనానికి వెళ్లాడు. తిరుగుప్రయాణంలో బాచుపల్లి శివారులో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం రమణారెడ్డిని అనంతపురానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృత్యుడికి భార్య కమల, కుమారుడు ఉన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గోవధను నిర్మూలించండి


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

కణేకల్లు, జూన్ 16: మండల వ్యాప్తంగా గోవధను పూర్తిగా నిర్మూలించాలని వీహెచ్‌పీ నాయకులు పోలీసులకు విన్నవించారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని నేసేపేట నుంచి ఒక ఆవును కొందరు వ్యక్తులు ఆటోలో తరలిస్తుండగా దానిని వీహెచ్‌పీ నాయకులు అడ్డుకున్నారు. అలాగే ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని దీనిపై ఫిర్యాదు చేశారు. అనంతరం గోవధను పూర్తిగా నిషేధించాలని విన్నవించారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు కోర్టులు కూడా గోవధను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొంతమంది దానిని అలాగే కొనసాగించడం దారుణమన్నారు. కోట్లాది మంది హిందూవులు గోమాతను దేవతగా పూజిస్తుంటే కొంతమంది స్వార్థపరులు మాత్రం గోవధను చేస్తూ వారి మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. పోలీసులు ఈ విషయం పట్ల తగిన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ నాయకులు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రవి, నాగరాజు, చిన్న, మురళి, శేఖర్, చంద్ర, చిక్కణ్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ సుజలస్రవంతి కేంద్రం పునరుద్ధరణ!


మధ్యాహ్న భోజన తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్, జూన్16: పట్టణంలోని వాటర్‌వర్క్స్ రోడ్డులో మూతపడ్డ ఎన్టీఆర్ సుజలస్రవంతి కేంద్రం పునరుద్ధరణకు అడుగులు పడుతున్నాయి. ఈ కేంద్రాన్ని పునరుద్ధరించాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఫోన్‌ద్వారా స్థానిక టీడీపీ నాయకుడు అరవింద నారాయణరెడ్డిని ఆదేశించారు. దీంతో ఆయన మూతపడ్డ కేంద్రాన్ని తెరిపించి యంత్రాలను ఆదివారం పరిశీలించారు. వీటిలో కొన్ని యంత్రాలు మరమ్మతులకు గురయ్యాయని గుర్తించారు. వెంటనే మెకానిక్‌ను పిలిపించిన త్వరితగతిన పనులు చేపట్టి పూర్తిచేయాలని సూచించారు. మరమ్మతు పనులకు దాదాపు రూ.3లక్షల మేర ఖర్చు అవుతుందని ఆయన తెలిపారు. దీంతోపాటు పట్టణంలోని 15 వైఎస్ఆర్ వాటర్‌ప్లాంట్లు కూడా పనిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారని ఆయన తెలిపారు. మధ్యాహ్న భోజన నిర్వహణను కూడా ఆయన పరిశీలించారు. చిన్నచిన్న లోపాలు ఉంటే సరిదిద్ది విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే ఆదేశించినట్లు ఆయన తెలిపారు. మూతపడ్డ అన్నక్యాంటీన్‌ను పరిశీలించినట్లు తెలిపారు.

చెత్తను తొలగించాలి


కాలనీలో పేరుకుపోయిన చెత్త

గుత్తి, జూన్ 16: పట్టణంలోని 20వ వార్డులో శివసాగర్ వెనుక ఎస్సీ కాలనీలో కుప్పలు కుప్పలుగా చెత్తను వేస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. చెత్త వల్ల దోమలు వ్యాపించి రోగాల బారిన పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని వాపోయారు. మున్సిపల్ అధికారులు స్పందించి చెత్తను తొలగించి, రోగాల బారిన పడకుండా కాపాడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

భార్య గొంతు కోసిన భర్త

తాడిపత్రిటౌన్, జూన్16: పట్టణంలోని పాతకోటలో శనివారం రాత్రి భార్య రమీజా గొంతును భర్త దాదాపీరా కత్తితో కోసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు పాతకోటలో నివాసం ఉంటున్న దాదాపీరా కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. ఈయనకు పట్టణంలోని టైలర్స్‌కాలనీకి చెందిన రమీజాతో ఐదునెలల కిందటే వివాహమైంది. కొన్నిరోజులు వీరి సంసారం బాగానే సాగింది. అయితే ఇటీవల రమీజాపై భర్త దాదాపీరాకు అనుమానం ఏర్పడింది. ఈక్రమంలో తరచూ ఆమెతో గొడవపడేవాడు. శనివారం రాత్రి మరోసారి ఇరువురు గొడవ పడ్డారు. ఈక్రమంలోనే ఆగ్రహానికి గురైన దాదాపీరా కత్తితో భార్య గొంతు కోశాడు. వెంటనే రమీజా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి వచ్చి దాడిని అడ్డుకున్నారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు రమీజాను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

